క్లుప్తంగా

దరఖాస్తు గడువు పెంపు


ప్రిన్సిపల్ సరోజిని

విజయపురి సౌత్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు, 6, 7, 8వ తరగతులలో మిగిలిన ఖాళీలకు, జూనియర్, డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం సీట్ల భర్తీకి నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువును ఏప్రిల్ 6 వరకు పొడిగించారు. ఈ మేరకు స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్ సరోజిని బుధవారం తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు సమర్పించాలని సూచించారు.

ఉచితంగా తాగునీటి పంపిణీ



మాచర్ల: పట్టణంలోని రద్దీ ప్రాంతాలలో రామకృష్ణ సేవా సమితి, స్వామి వివేకానంద సంఘం తరపున వ్యవస్థాపక అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మూడు రోజులుగా కూలింగ్ వాటర్ పంపిణీ చేస్తున్నారు. మూడు నెలల పాటు ఇలా సరఫరా చేయనున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం అంబేడ్కర్ సెంటర్‌లో నీటిని పంపిణీ చేశారు.

రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు



మాచర్ల : బీసీ, ఈబీసీ తదితరులకు రుణాలు ఇవ్వడానికి పట్టణంలోని మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం పురపాలక సంఘ కమిషనర్ ధూళిపాళ్ళ వేణుబాబు, మెప్మా ప్రాజెక్టు అధికారిణి శ్యామలాదేవి, సీసీలు రాజశేఖర్, అంజలీ, బ్యాంకుల అధికారులు దరఖాస్తులను పరిశీలించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల సుమారు 850కి పైగా దరఖాస్తులు పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

సాధారణ ప్రసవంతోనే మేలు



మాచర్ల: కమ్యూనిటీ ఆసుపత్రులలో సాధారణ ప్రసవానికే ప్రాధాన్యం అవకాశం ఇవ్వాలని మాచర్ల ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభాను, గైనకాలజిస్టు దేవీ సౌమ్యలు అన్నారు. బుధవారం ప్రభుత్వాసుపత్రిలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. సాధారణ కాన్పు వలన ఆసుపత్రిలో 2, 3 రోజులుంటే సరిపోతుందన్నారు. ఖర్చు ఉండదన్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం పొందాలన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష



మాచర్ల: శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబు, కౌన్సిలర్ గట్లా కోటిరెడ్డి, చందూగౌడ్‌లు రథం సెంటర్‌లో పర్యటించారు. ఉత్సవాలకు సంబంధించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ నెల 17వ తేదీన జరిగే రథోత్సవానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేడుకను ఘనంగా నిర్వహించాలని సూచించారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



మాచర్ల : పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇన్‌స్టో ఒలింపియాడ్‌లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎ.హరిణి బుధవారం తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ఫలితాలలో 280 మంది తమ విద్యార్థులు మెరిట్ సాధించారన్నారు. ప్రిన్సిపాల్, డీన్ అనిల్‌లు వారిని అభినందించారు. ప్రైమరీ సెక్షన్ ఇన్‌చార్జి షకీలా తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తును నిండు హృదయంతో ప్రార్థించాలి

రెంటచింతల: పవిత్ర హృదయంతో తపస్సుకాల దీక్ష తీసుకున్న మాలధారులు యెహోవా కుమారుడైన యేసుక్రీస్తును నిండు హృదయంతో ప్రార్థించాలని స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దు మర్రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలోని వివిధ ప్రాంతాలలోనున్న యేసు తిరుహృదయం, బాలయేసు, ఫాతిమా, కార్మెల్ మాత, సుబ్బన్నతోట కాలనీలోని బాలయేసు, ఆంతోని వారి దేవాలయం, ఆరోగ్య మాత, లూర్దుమాత, ఆరోగ్యనాథుడు, నిత్య సహాయమాత, చిన్న తేరేజమ్మ, యేసు దివ్య కారుణ్య మందిరాల వద్ద ప్రత్యేక ప్రార్థనలలో భాగంగా 14 స్థలాల కార్యక్రమంలో ఫాదర్ భక్తులకు తపస్సుకాలం విశిష్టతను వివరించారు. లోకరక్షకుడైన ఏసుక్రీస్తు అంతిమ గడియలలో శిలువ వేయబడి పడిన కష్టాలను క్రైస్తవులందరూ నిష్టతో స్మరించుకుంటూ 40 రోజులపాటు ఉపవాస దీక్షలను చేయాలన్నారు. నిండు హృదయంతో ఉపవాసం, ప్రార్థన, దాన ధర్మాలు చేయాలని పేర్కొన్నారు. దీక్ష తీసుకున్న వారు పోప్ చెప్పిన సూచనలు పాటిస్తూ సన్మార్గంలో నడవాలని తెలిపారు. మాలధారులు 40 రోజులపాటు ఈ తపస్సుకాల ప్రార్థనలలో భాగంగా ప్రతి బుధ, శుక్రవారాలలో సాయంత్రం నిర్వహిస్తున్న క్రీస్తు శిలువ ధ్యానం గుర్తు చేస్తూ 14 స్థలాల పాటలను స్మరించుకుంటూ ప్రార్థనలలో కచ్చితంగా పాల్గొనాలన్నారు. ప్రార్థనలలో సహాయ గురువులు ఫాదర్ అగస్టీన్, మఠకన్యలు, చర్చి పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రార్థనలో వైఎల్ మర్రెడ్డి తదితరులు

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక


యల్లాల రమేష్ బాబు యాదవ్


మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి


నాగెండ్ల శ్రీనివాసరావు

మాచర్ల: మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సంబంధించి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు సీహెచ్ నాగిరెడ్డి, గట్లా సత్యనారాయణరెడ్డిలు తెలిపారు. కోర్టు ప్రాంగణంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం వివరాలు వెల్లడించారు. అసోసియేషన్ అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది యల్లాల రమేష్‌బాబు యాదవ్, ప్రధానకార్యదర్శిగా మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా నాగెండ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఉప్పు లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శిగా జి.వి. ప్రసాద్, లేడీ రిప్రజెంటేటీవ్‌గా సంధ్య, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా రాజేష్, చల్లా వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కోర్టు జడ్జీలు కళ్యాణ చక్రవర్తి శ్రీనివాసరావు, పల్లెపోగు ప్రశాంత్‌లను కలిసి కార్యవర్గ ఎన్నిక విషయాన్ని తెలిపారు. పలువురు న్యాయవాదులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

వరాహావతారంలో శ్రీరాముడు

మాచర్ల : త్వరలో జరగబోయే శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారిలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలను అర్చకులు వేణుగోపాలచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షులు బచ్చు రామారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం శ్రీ సీతారామ లక్ష్మణ స్వాములు వరాహ అవతారంలో దర్శనమిచ్చారు. ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొత్తూరి వెంకట బాల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మారం శ్రీనివాసరావు, మేడం నాగేశ్వరరావు, చీదెళ్ళ ఆంజనేయులు, వూటుకూరి పాలయ్య, చిన్ని సత్యనారాయణ, కజ్జం నాగేశ్వరరావు, పోలూరి వెంకటేశ్వర్లు, కోశాధికారి భవనారి లోకనాథ కోటేశ్వరరావు, ఉప కార్యదర్శులు గొల్ల వెంకటేశ్వర్లు, విడేలా సీతాలక్ష్మీనారాయణ, కంభంపాటి వెంకటరమణ (చంటి), గజవల్లి రత్నం, బత్తుల వీరబ్రహ్మం, గుండా శ్రీనివాసరావు, పందిరి నరసింహారావు, కర్నాటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


అలంకరణలో శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలు

బాలికలు అప్రమత్తంగా వ్యవహరించాలి

నకరికల్లు: కొత్తవారు, పరిచయం లేనివారితో బాలికలు అప్రమత్తంగా వ్యవహరించాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సుభాషిణి సూచించారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు శక్తి యాప్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శక్తి యాప్ బాలికలకు రక్షణ ఇస్తుందన్నారు. యాప్‌ను ఉపయోగించే విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కొత్తవారు వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నా, బండి ఎక్కమని మాయమాటలు చెబుతున్నా జాగూరకతతో వ్యవహరించాలని అన్నారు. సోషల్ మీడియా మాయలో పడవద్దని సూచించారు. ఒంటరిగా బయటకు వెళ్లేపుడు టీచర్‌లు, తల్లిదండ్రుల సూచనలు పాటించాలన్నారు. అనుమానితుల నుంచి ప్రమాదం పొంచి ఉందన్న ఆలోచన వస్తే పరిచయస్తులు, పోలీస్ వారి నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చి ప్రమాదం నుంచి తెలివిగా తప్పించుకోవాలన్నారు. అనంతరం శక్తి యాప్ పోస్టర్‌లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సంధ్యారాణి, చల్లా సురేష్, ప్రిన్సిపాల్ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ సుభాషిణి

నేడు రుణ అర్హత మేళా


గురజాల: స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో గురువారం రుణ అర్హత మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గౌసియా బేగం బుధవారం తెలిపారు. బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలకు మండల పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



రెంటచింతల: పుస్తక పఠనంతో విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందని కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాస్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి, మాట్లాడారు. వైస్ ప్రిన్సిపల్ ఎస్. భాగ్యమేరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరస్వతి మాతకు పూజలు



పిడుగురాళ్ల: పట్టణంలోని నాలుగు గుడి దేవస్థానంలో ఉన్న మహా సరస్వతి అమ్మవారికి పెన్నులు, పుస్తకాలతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. దేవీ వసంత నవరాత్రులు సందర్భంగా వసంత పంచమిని పురస్కరించుకొని బుధవారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారి వెంకటేశ్వర శర్మ తీర్థప్రసాదాలను అందజేశారు.

నగలు, నగదు చోరీ

అచ్చంపేట: పట్టపగలు దుండుగలు ఎవరూలేని ఇంట్లోకి ప్రవేశించి రూ.5 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు దొంగిలించిన ఘటన మండలంలోని మాదిపాడులో మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన మోటార్ మెకానిక్ షేక్ అక్బర్‌వలి మంగళవారం ఉదయం సామాను కొనుగోలు చేసేందుకు ఇంటికి తాళం వేసి కృష్ణానది దాటి వెళ్లాడు. సాయంత్రం 7 గంటల సమయంలో వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూస్తే బీరువాలో దాచుకున్న బంగారు ఆభరణాలు రూ.1.50 లక్షల నగదు కనిపించలేదు. ఇరుగు పొరుగు వారిని అడిగినా ఫలితం లేకపోయింది. దీంతో మంగళవారం రాత్రి అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఫౌండేషన్ సేవలు అమూల్యం



మాచర్ల రూరల్: పేద విద్యార్థులకు అల్లం రామిరెడ్డి ఫౌండేషన్ సేవలు అమూల్యమని హెచ్‌ఎంలు టి.ఆదిలక్ష్మి, కె.నాసరయ్యలు అభినందించారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఎంపీపీ, ఆర్‌సీఎం ఎలిమెంటరీ పాఠశాలలోని విద్యార్థులకు పరీక్ష కిట్లను, మిఠాయిలను పంపిణీ చేసి వారు మాట్లాడారు. గ్రామ మాజీ సర్పంచ్ అల్లం రామిరెడ్డి పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఏటా ఈ కిట్లను అందిస్తున్న ఆయన తనయుడు అల్లం కోటిరెడ్డి అభినందనీయులని పేర్కొన్నారు. కాసుల అంజిరెడ్డి, ఉపాధ్యాయులు విజయకుమారి, మల్లిక, భారతి, పిచ్చయ్య, ఆర్‌వీఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులతో సమావేశం

నకరికల్లు: పైపులైన్ ఏర్పాటు చేసే క్రమంలో భూములను కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం విషయమై గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.పుల్లారావు బుధవారం తెలిపారు. మండలంలోని చల్లగుండ్ల, నకరికల్లు, నర్సింగపాడు గ్రామాల్లో బీపీసీఎల్ పైపులైన్ ఏర్పాటు చేస్తున్న భూముల రైతులకు నష్టపరిహారం విషయమై సంబంధిత రైతులతో జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, బీపీసీఎల్ సంస్థ ప్రతినిధులు మాట్లాడి రైతుల అభిప్రాయాలను సేకరిస్తారని అన్నారు. రైతులు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు విధిగా హాజరు కావాలని సూచించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

గురజాల రూరల్ : మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం క్రీడా దుస్తులు అందించారు. నారాయణ ఎడ్యుకేషనల్ మరియు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు లేళ్ల కృష్ణ వీటిని వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు కూడా ప్రధానమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సాంబశివరావు, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, పెద్దబాబు, సీమోను తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలి



మాచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలోని అర్హులందరికీ పని కల్పించాలని పథక మండల అధికారి టి.నాగ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఈ బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని తెలిపారు. బుధవారం ఉపాధి హామీ కార్యాలయంలో మండల పరిధిలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం జరిగింది. వేసవి కాలంలో పశువులకు నీటి తొట్టెలు, గ్రామీణ ప్రాంతంలో సేద్యపు నీటి కుంటలు, పంట కాల్వలను పునరుద్ధరించటం, చెరువులు, కుంటలు సమగ్రంగా అభివృద్ధి పర్చటంతోపాటు దినసరి వేతనాన్ని రోజువారీగా రూ. 307 చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ విషయాలన్నింటిని ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతి గ్రామంలో కూలీలు, మేట్లకు వివరించాలని సూచించారు. వేసవి కాలంలో ఉపాధి పనులు తప్పనిసరిగా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



దాచేపల్లి: మండల పరిధిలోని తంగెడ గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గుజరాల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి బుధవారం పర్యటించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు చల్లగుండ్ల యాకూబు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను కాసు పరామర్శించారు. పార్టీ కార్యకర్త చల్లగుండ్ల నాగరాజు అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహం వద్ద కాసు మహేష్‌రెడ్డి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. నాయకులు దేవళ్ల వీరస్వామి, జి.వెంకటరెడ్డి, బి.శౌరిరెడ్డి, రామకోటయ్య, నరసింహారావు, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పశు బీమాకు ప్రీమియం తగ్గింపు

అచ్చంపేట: పశు పోషకులు తమ పశువులకు పశు బీమా పథకం ద్వారా చెల్లించవలసిన బీమా ప్రీమియం తగ్గించినట్లు పశు వైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.30 వేల విలువచేసే పశువుకు చెల్లించాల్సిన బీమా ప్రీమియం రూ.398 ఉండేదని, ఇప్పుడు రూ.298 చేసినట్లు చెప్పారు. ప్రతి రైతు 10 పశువుల వరకు ఈ బీమా పథకం ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు.

ఏరియా వైద్యశాల ప్రాంగణంలో అన్నసంతర్పణ



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో డొక్కా సీతమ్మ అన్న ప్రసాద వితరణ పథకంలో భాగంగా జనసేన పార్టీ నాయకుడు అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు అన్నం సత్యనారాయణ ధర్మపత్ని కీర్తిశేషులు అన్నం దేవకీదేవి పుణ్యతిథి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో బుధవారం 180 మంది రోగులు, వారి సహాయకులకు అన్నసంతర్పణ నిర్వహించారు. దేవకీదేవి కుమారుడు న్యాయవాది అన్నం కృష్ణ, వారి కుటుంబ సభ్యులు స్వయంగా ఆహారం వడ్డించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు నరసింహారావు, రామమోహన్‌రావు, శ్రీరామమూర్తి, రామకోటేశ్వరరావు, శ్రీనివాసరావు, రామకోటేశ్వరరావు, వీరాస్వామి, అప్పారావు, నాగేశ్వరరావు, కాశీ విశ్వనాథం ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు


సాంబశివరావు


కిషోర్‌కుమార్


సుభాని

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గురజాల నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్‌గా పిడుగురాళ్ల మండలంలోని చెన్నాయిపాలెం గ్రామానికి చెందిన బొలినేడి సాంబశివరావును నియమిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది.

- గురజాల నియోజకర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులుగా మండల కేంద్రమైన మాచవరానికి చెందిన కావటి కిషోర్‌కుమార్‌ను నియమించినట్లు వైఎస్సార్‌సీపీ గురజాల నియోజకర్గ కార్యాలయం తెలిపింది.
- గురజాల నియోజకర్గ మైనార్టీ ప్రెసిడెంట్‌గా దాచేపల్లి పట్టణానికి చెందిన షేక్ మహబూబ్ సుభానిని నియమించారు. నియామకానికి సహకరించి గురజాల నియోజకర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి వీరు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

లక్ష్మీనరసింహ స్వామి సేవలో కాసు కుటుంబం

దాచేపల్లి: మండలంలోని తంగెడ గ్రామ సమీపంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలు కుటుంబంతో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణానది అవతలి ఒడ్డున దేవాలయంలో కాసు కుటుంబం ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు సమర్పించింది. అంతకుముందు వారికి ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. వీరి వెంట పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోటా కృష్ణ, షేక్ సుభాని, మాజీ జెడ్పీటీసీ మూలగొండ ప్రకాష్ రెడ్డి, ఎంపీపీ కందుల జాను తదితరులు ఉన్నారు.


పూజల్లో మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

చామర్రు గ్రామ భూముల ఆన్‌లైన్ ప్రారంభం

అచ్చంపేట: మండలంలోని చామర్రు రెవెన్యూ పరిధిలోని గ్రామాల సేద్యపు భూములను ఆన్‌లైన్ చేసి యూనిక్ నంబరు ఇచ్చే ప్రక్రియను బుధవారం నుంచి ప్రారంభించినట్లు ఏవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఈ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, కానీ చామర్రు రెవెన్యూ పరిధిలోని గ్రామాల భూముల నమోదు కార్యక్రమం సాంకేతిక సమస్యల కారణంగా కాలేదన్నారు. ఉన్నతాధికారుల చొరవతో సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించడం జరిగిందన్నారు. చామర్రు రెవెన్యూ పరిధిలోని గ్రామాల రైతులు యూనిక్ నంబరు నమోదు చేయించుకునేందుకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకుని రావలసి ఉంటుందని చెప్పారు. మరో వారం రోజులపాటు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని, రైతులు త్వరపడి సహకార పరపతి సంఘం వద్ద గల రైతు సేవా కేంద్రంలో తమ భూములను ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. యూనిక్ నంబర్లు ఉంటేనే ప్రభుత్వ రాయితీలు, పంట కొనుగోళ్లు, ప్రభుత్వ పరిహారం వంటివి పొందే అవకాశం ఉంటుందని ఏవో తెలిపారు.

పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం

సత్తెనపల్లి: మండుతున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తి తీర్చుటకు సామాజిక బాధ్యతగా ఉచిత మంచినీరు అందించాలనే ఉద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అన్నారు. ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి ఆధ్వర్యంలో పట్టణంలోని పెన్షనర్స్ హోమ్ ఎదుట చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ చలివేంద్రం మే 31 వరకు సుమారు రెండు నెలల పాటు కొనసాగించాలని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ నిర్ణయించుకుందన్నారు. కార్యక్రమంలో ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేబీఆర్‌జే ప్రసాద్, ఉపాధ్యక్షుడు పి.చంద్రయ్య, బాధ్యులు కె.పోతులూరయ్య, అంకాళ్ళ ప్రభుదాసు, డాక్టర్ సరికొండ రమాదేవి, జి.సుందర్‌సింగ్, ఎల్.సుబ్బారావు, షేక్ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.



తెరుచుకున్న డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

వెంటనే తెరిచి విధులు నిర్వహించాలని ఆదేశించిన డీఎంహెచ్‌వో

దొడ్లేరు(క్రోసూరు): 'తెరుచుకోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం' అని సాక్షిలో బుధవారం వచ్చిన కథనానికి పల్నాడు డీఎంహెచ్‌వో బి.రవి స్పందించి తక్షణమే భవనం తెరవాలని మండల వైద్యాధికారులను ఆదేశించారు. వెంటనే క్లినిక్‌ను తెరుస్తున్నట్లు రాతపూర్వకంగా మండల వైద్యులు డాక్టర్ సాధ్, డాక్టర్ సిరిచందన డీఎంహెచ్‌వోకు తెలియజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ ధనరేఖ, ఏఎన్‌ఎం కోటేశ్వరమ్మ, ఆశ వర్కర్లు హాజరై విధులు నిర్వహించారు. ఇక నుంచి దొడ్లేరు–2 సచివాలయ పరిధి ప్రజలకు హెల్త్ క్లినిక్ భవనంలో ఎంఎల్‌హెచ్‌పీ అందుబాటులో ఉండి బీపీ, షుగర్, రక్త పరీక్షలు వంటివి నిర్వహించి వైద్యుల సూచనల మేరకు మందులు ఇవ్వటం జరుగుతుందని వైద్యులు తెలిపారు.


దొడ్లేరు-2 డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో విధులకు హాజరైన సిబ్బంది

విద్యార్థులు సేవా దృక్పథంతో ఉండాలి

రాజుపాలెం: స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పాల్గొనే విద్యార్థులు సేవా దృక్పథం కలిగి ఉండాలని గైడ్స్ కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ ఉన్నం పద్మావతి తెలిపారు. మండలంలోని గణపవరం జిల్లా పరిషత్ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గైడ్స్ కోర్సు కో ఆర్డినేటర్ మాట్లాడుతూ గైడ్స్ క్రమశిక్షణతో మెలగాలని, సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని తెలిపారు. ప్రతి గైడ్ మానవతా దృక్పథంతో మెలగాలని, పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం 16 మంది బాలురకు, 16 మంది బాలికలకు గైడ్స్ కిట్స్‌ను అందజేసిందని, అదేవిధంగా పాఠశాల ఓల్డు స్టూడెంట్స్ అసోసియేషన్ గైడ్స్ కిట్సుకు రూ.32 వేలను హెచ్‌ఎం బి.సుగుణమణికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూలక్ష్మీ, ఈశ్వరవరప్రసాద్, స్కౌట్స్ మాస్టర్ సీతారామయ్య, గైడ్స్ టీచర్ రమణమ్మ పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

రాజుపాలెం: మండలంలో నేటి నుంచి 11వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీవీ సత్యనారాయణ బుధవారం తెలిపారు. 3వ తేదీన అనుపాలెం, చౌటపాపాయపాలెం, కుబాద్‌పురం, 4వ తేదీన కోటనెమలిపురి, రాజుపాలెం, అనుపాలెం, 8వ తేదీన రెడ్డిగూడెం, బ్రాహ్మణపల్లి, ఇనిమెట్ల, 9వ తేదీన మొక్కపాడు, దేవరంపాడు, ఉప్పలపాడు, 10వ తేదీన గణపవరం, అంచులవారిపాలెం, చాల్లాపల్లితండా, 11వ తేదీన బీరవల్లిపాయ, నెమలిపురి, బలిజేపల్లి తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చేర్పులు మార్పులు ఉన్నా, కొత్తగా ఆధార్ కార్డులు పొందే వారు ఆయా గ్రామాల్లోని ఆధార్ క్యాంప్‌ల్లో పాల్గొనాలని సూచించారు.